# వెలుగు చూపిన చీకటి

సుశీలకు పెండ్లయి అత్తవారింటికి పోయినప్పటి నుండి వసంతకేమీ తోచడం లేదు. దినచర్య సరిగానే జరుగుతుంది. నెల జీతం సరిగానే తెచ్చుకుంటోంది. కాని సంతోషం లేదు. ఏవో భయాలు వెంటాడుతున్నాయి. ఏదో నిస్పృహ మనసు తొలిచేస్తుంది. ప్రత్యేకం ఇదీ అని చెప్పలేకుండా, విరుషమైన రూపం లేని అస్తవ్యస్తపు బాధ ఊపిరిలో పెరుగుతోంది.

వసంతకేమీ తోచడం లేదు. ఇన్నేండ్లుగా కలిసి తిరిగి సుశీల దగ్గరో లేక పోవడం వల్ల. సుశీల మంచితనం. స్నేహం భూతద్దాల్లో కనిపిస్తోంది. ఇదికాకుండా సుశీల అంటే ఒకరకమైన జెలసి పెరిగిపోతుంది. ప్రైమరీ స్కూలు నుండి హైస్కూలు వరకు కలిపి చదువుకొన్నారు. ఏడవ తరగతిలో ఫేలయితే వసంతకు బాధనిపించ లేదు. ఎందుకంటే తనతోటే చదువుకునే, తమతోపాటే ప్రక్క పోర్షన్లో అద్దెకుండే రంగనాధాచార్యుల కూతురు సుశీల ఫేలయింది కనుక! ఒకర్ని చూసి ఒకరికి సంతృప్తి!! పదోతరగతి బోర్డు పరీక్షలో పాసయినప్పుడు ఒకర్ని చూసి ఒకరికి సంతృప్తి. ఇద్దరూ కలిసి సినిమాకుపోతే, ఒకరికితోడు మరొకరున్నారని సంతృప్తి. ఒకేరకం లంగాలూ

పరికిణీలూ కుట్టించుకున్నప్పుడు. ఒకేరకం చీరలు కొనుక్కున్నప్పుడూ' ఒకర్నిచూసి ఒకరికి సంతృప్తి ఎవరి బంధువులు వారి వారి యిళ్ళలోకి రావడం, పోవడం. సంబంధాలు కుదరకపోవడంతో తల్లిదండ్రులు విసుక్కుని "మీకసలు పెండ్లయ్యే యోగం వుందో లేదో" అని ఆందోళన పడుతున్నప్పుడు ఒకర్ని చూసుకుని ఒకరికి ధైర్యం. అటువంటిది ఏదో అనుకోని ప్రమాదం జరిగినంత అకస్మాత్తుగా సుశీలకు పెండ్లి నిశ్చయం కావడం. అయిపోవడం, కూడా జరిగాయి.

వసంతకేమీ తోచడంలేదు. అప్పటో యిద్దరూ ఇంటర్ చదువుదామనుకున్నారు. వసంతకు ఆర్థికంగా సహాయపడేవాళ్ళు లేరు. ఏదో దగ్గర్లో వున్న టైప్‌ఇనిస్టిట్యూటులో టైప్ నేర్చుకుని, ఓ బంధువు సహాయంతో 'ఫల్గుణా ఎంటర్ ప్రైజెస్ అనే ప్రయివేటు సంస్థలో టైపిస్టుగా ఉద్యోగం సంపాదించుకుంది. కాని ఉద్యోగం చేయాలని ఎవరికీ లేదు. ఆఫీసుకు పోనూ, రానూ అయ్యే బస్సు. రిక్షాఛార్జీలు స్వంత ఖర్చులూ పోనూ ఏదో కొంత మొత్తం మాత్రం మిగిలేది. దాంతో యింట్లో చిల్లర ఖర్చులు వెళ్ళేవి. పెళ్ళికుదిరేదాకా నడవనీ అనుకున్నారు యింట్లో. సుశీల కుటుంబం ఓ మోస్తరుగా బావుంది. కాని ఎక్కువ చదివిస్తే, ఎక్కువ చదివినవాణ్ణి ఎక్కువ కట్నం యిచ్చి తీసుకురావల్సి వస్తుందని, అది తమవల్ల కాదని, అంతటితో ఆపేశారు. మూడేళ్ళు యిలాగే గడిచాయి.

అప్పుడప్పుడు శకుంతల విషయాలు తెలిసేవి. శకుంతల వీళ్ళ క్లాసుమేటు. ప్రతిదానికి వాదించేది. మూడనమ్మకాలమీద ఉపన్యాసాలిచ్చేది. క్లాసులో కొందరు బరితెగించింది అనేవారు ఉన్నట్టుండి 'మొగుడు చచ్చినవాళ్ళందరూ బొట్టు ఎందుకు పెట్టుకోగూడదు? అనీ గంభీరంగా ప్రశ్నించేది లంచ్ టైమ్‌లో లంచ్ తీసుకుంటున్న మిగిలిన ఆడపిల్లలందరూ ఆశ్చర్యపోయేవారు. వెంటనే మళ్ళీ వివరణ కూడ యిచ్చేది. అవసరం లేదు. మొగుడు చస్తె చచ్చాడు బొట్టు పెట్టుకోవలసిందే, గాజులు పెట్టుకోవలిసిందే, రంగు చీరలు కట్టుకోవలసిందే, మంచివాడు దొరికితే మళ్ళీ పెళ్ళి చేసుకోవాల్సిందే. ఏం ఎందుకు తీయాల్సొలి,

మొగుడితో వచ్చిన తాళి, మట్టెలు తీసెయ్యండి. బొట్టూ గాజులు చిన్నప్పటి నుండి వున్న వేకదా ముసలితనం వస్తే పోనీయ్. యవ్వనంలో వున్న ఆడపిల్లలు మరొకణ్ణి జీవిత భాగస్వామిగా చేసుకోవడంలో తప్పేమిటి? .... ఆ ధోరణికి కొందరు హేళనగా నవ్వుకునేవారు. కొందరు సీరియస్‌గా ఆలోచించేవారు. సుశీల వసంత, శకుంతల వివరీతపు వాదనలకు నొచ్చుకునేవారు. శకుంతల పిళ్ళిద్దర్నీ ముసలమ్మలని. చాదస్తురాం(డని, పిరికివాళ్ళని, అందరిముందు, అందరితో అనేది, శకుంతల పక్షంవాళ్ళు గేలిచేసేవారు, అయినా భయం - శకుంతలతో వాదం పెంచుకోవాలంటే - ఆ శకుంతల విషయాలు అప్పు డప్పుడూ తెలిసేవి.

శకుంతల ఇంటర్ చదవలేదు. పెళ్ళి చేసుకుంది. భర్తతో తనకు సరిపడ దని తెలుసుకుంటూనే, సహనంగా ఇద్దర్ని కని - చివరకు ఈమధ్యే మొగుణ్ణి వదిలేసి, - ఓ (ప్రయివేటు పాఠశాలలో ఉద్యోగం సంపాదించుకుని నైట్ కాలేజీలో చదువుకుంటోంది.

శకుంతల విషయం మాట్లాడుకుంటున్నప్పుడు ఇద్దరి గుండెలూ పీచుపీచు మంటూండేవి. ఎంత ధైర్యం దానికి అని నోళ్ళు వెళ్ళబెట్టేవారు. అవే పరిస్థితులు తమ కెదురైతే ఎలా? అని భయపడేవారు. ఇద్దరూ భయపడేవారు గనక, ఒకర్ని చూసి ఒకరికి సంతృప్తి.

అలాంటి సంతృప్తి యిప్పుడు వసంతకు దొరకడంలేదు. సుమారు నెల నుండి సుశీల ఏవో పూజలు చేసింది. బంగారుగాజులు చేయించుకుంది. అవి పెట్టుకుని దగ్గర్లోనే వున్న యాదగిరి లక్ష్మినరసింహ స్వామిని దర్శనం చేసుకుని వచ్చింది. ఇలాంటి విషయాల్లో ఇంట్లో అందరూ సుశీలకు సహాయంగా వుంటున్నారు. ఎన్నో మొక్కులు మొక్కి వచ్చిందట - అదేం మహత్యమో - వచ్చిన వారంలోనే పెళ్ళి నిశ్చయమైంది. మరో నెలకే పెళ్ళయిపోయింది. సుశీల వెళ్ళిపోయింది. ఉత్తరం కూడా (వ్రాయలేదు. అందుకే వసంతకేమీ తోచడంలేదు.

దీపావళి పండుగకు సుశీల తన భర్తతో సహా పుట్టింటికొచ్చింది. వాళ్ళి ద్దర్ని చూస్తుంటే ఎంతో సంతోషంగా వుండేది. వెను వెంటనే తన అభాగ్యానికి చింతించాల్సివచ్చేది. సగర్వంగా పరిచయం చేసింది భర్తను సుశీల. అతనిది మామూలు ఉద్యోగమే అయినా బాగా చదువుకున్న వాడులా వున్నాడు. గంభీరంగా వున్నాడు. ఓవారం సరదాగా గడిచింది.

సుశీల వెళ్ళిపోయేముందు వసంత కొంత వ్యవహార దక్షతను ప్రదర్శించి పెళ్ళికి ముందు సుశీల చేసిన పూజల వివరాలు, మొక్కుల వివరాలూ తెల్సు కుంది. ఆ గాజుల మహత్యం మీద తనకు నమ్మకం కుదిరిందని, అవి యిచ్చేసి వేరేవి చేయించుకోమని. వాటి ఖరీదు నెల నెలా కొంత కొంత తీర్చుకుంటా నని, పెళ్ళి నువ్వే చేసిందానివవుతావనీ సన్నగా యేడ్చింది. 'ఈమాత్రానికేనా!' అంటూ సుశీల బంగారుగాజులిచ్చి వెళ్ళింది.

గాజుల్ని వేసుకున్న నాటి నుండీ వసంతకు కొండంత ధైర్యం హెచ్చింది. సంతోషం పెరిగింది. ఇక త్వరతో పెళ్ళి అవుతుందని, బజార్లో, ఆఫీసులో యువకులంతా తననే చూస్తున్నారనీ అనుకుంది. మూడ్రోజుల తర్వాత యింటి ప్రక్కనే వున్న మిల్క్‌బూత్ క్యూలో ఉదయాన్నే కొత్తవ్యక్తి కనిపించాడు. మరునాడు రేషన్ క్యూలో వెనకే వచ్చి నిలబడ్డాడు. మరోనాడు కిరసనాయిలు కోసం, తనలాగే వచ్చాడు. ఇంకోనాడు పార్కు ముందు ఎదురయ్యాడు - అతను కొటేశ్వర్రావైనట్లు పరిచయం చేసుకున్నాడు.

పూజల ఫలితం, గాజుల మహిమ పనిచేయడం మొదలు పెట్టిం దనుకుంది. అతను టెలిఫోన్ ఎక్స్‌చేంజ్‌లో ఉద్యోగినని చెప్పినప్పుడు. గాజుల్ని ఆనందంతో ముద్దు పెట్టుకుంది. ఎంతైనా మహిమ గలవి కదా! అసమర్థులను, సోమరిపోతులను తన దగ్గరికి రానిస్తాయా - అని అనుకుంది. అతను యింటికి రావడం మొదలెట్టాడు. యితనితో యిక పెళ్ళయిపోతుందేమో అనుకుంది. ఎక్కడిదో దూరపు బంధుత్వం కూడా వుందని, అతనే ఇంట్లో చెప్పి వొప్పించి నప్పుడు, ఆ అనుభూతిని, ఆనందపు ఆవేశాల్ని చిన్ని గుండెలో యిముడ్చుకోలేక గాజుల్ని దేవుడి ముందు పెట్టి నమస్కరించి, కళ్ళకద్దుకుని మళ్ళీ తొడుక్కుంది.

వసంత కోటేశ్వరావును ప్రేమించిందో లేదో చెప్పడం కష్టం కాని, అతనితో పెళ్ళి నిశ్చయమైనప్పుడు ఆకాశాన్నందుకున్నంత ఆనందం, ఏదో కొండను వంచేసినంత సంతోషం, సుశీలను, శకుంతలను మించిపోతున్నాననే ఆవేశం కలిగాయి.

పెళ్ళి మామూలుగా జరిగింది- వసంతకు గొప్పగా అనిపించింది. మామూలు జీవితం నిండుగా వుందనిపించింది. అతను ఉద్యోగం మానేయమన్నప్పుడు ఎంతో మంచి ఉదాత్తమైన విషయం చెప్పాడనిపించింది. పెళ్ళవుతుందో లేదో అనుకున్న వసంతకు పెళ్ళికావడం గొప్ప సంతృప్తి నిచ్చిందనుకున్నారు అందరూ. నెలరోజులు సంతృప్తిగా గడిచాయి. ఆఫీసులో తీసుకున్న సెలవులయిపోయి మళ్ళీ జాయిన్ కావాల్సినరోజు వొచ్చినప్పుడు "ఎంతో కష్టపడి సంపాదించుకుని, ఎంతో ఇష్టంతో చేస్తున్న ఉద్యోగం వదలడం దేనికి? పోనీ యిద్దరం ఉద్యోగాలు చేద్దాం. పిల్లా పీచు లేనిది యింట్లో నీకు ఎలా పొద్దుపోతుంది?" అని భర్త అన్నప్పుడు, అతని అభ్యుదయ భావాలకు మురిసిపోయింది. పేకాటలో డబ్బు సంపాదించుకొచ్చిన భర్త ఎంతో బ్రతక నేర్చిన నేర్పరిగా కనిపించాడు. ఎవరో సినిమాలో వేషం యిప్పిస్తానంటే నెలజీతమంతా మద్రాసులో వెదజల్లి రావడంవల్ల అతనిలోని గొప్ప కళాకారుడు దర్శన మిచ్చాడు. అప్పుడప్పుడు త్రాగి రావడం, ధనికులతో స్నేహం చేయడం కార్లలో తిరుగుతూ వుండడం ఎంతో గొప్పగా అనిపించింది. రాను రాను అతను తన జీతం యింట్లో ఇవ్వకపోగా వసంత జీతాన్ని తీసుకుపోవడం, ఆమెకు కొంచెం కష్టమనిపించినా - భార్య డబ్బులు కదా అనో, ఆడదాని కష్టార్జితం అనో పట్టింపులు పెట్టుకోక కలిమిడిగా తిరిగే భర్త మనస్తత్వం ఎంతో ఉదాత్తంగా ఊహించుకుంది.

వుండి వుండి ఓరోజు కోటేశ్వరావు యింటికి రాలేదు. మరునాడు కూడా రాలేదు. వసంత గాబరా పడింది. అదే ఆందోళన, ఎటు వెళ్తున్నట్టు చెప్పలేదు, ఎందుకు రాలేదో అర్థం కాలేదు, యాంత్రికంగా ఆఫీసుకు వెళ్ళొచ్చింది. ఆఫీసులో ఏంపని చేసిందో జ్ఞాపకం లేదు ఒక్కటే ఆలోచన: ఎటువెళ్ళి వుంటాడు. విడిచిపెట్టి వుండలేకపొయ్యేవాడు కదా: భయం గుండెను పిసుకు

తున్నట్లనిపించింది. చీకటి వేళ వచ్చాడు. యింటికి రాకపోవడానికి కారణ మేమిటో చెప్పలేదు. హడావిడిగా డబ్బేమైనా వుంటే యివ్వమన్నాడు. జీతమంతా యిదివరకే యిచ్చేసిన వసంత ఏమీ లేదంది. ఓ వారంలో విడిపించుకొస్తాను. బంగారుగాజు లివ్వమన్నాడు. వసంతకు దుఃఖం ఆగలేదు. ఏడ్పు మొదలెట్టింది. యింటికి రాకుండా ఎక్కడెక్కడో తిరుగుతున్నందుకు గొణుక్కుంది. యింట్లోంచి బంగారుగాజులు తీసుకుపోవడం బావుండదని వాటి బాకీ ఇంకా తీరలేదని, అని యింకా తన స్వంతం కాలేదని గొణుకుతూనే చెప్పింది. యేడుస్తూనే గొణిగింది. చెబుతూనే యేడ్చింది. త్రాగొచ్చాడేమో వాసన .... గదంతా నిండింది.

ఐదునిమిషాలు చూశాక. 'అబ్బా యిది అచ్చంగా ఆడదేరా' అనుకు న్నాడు. బలవంతంగా గుంజుకుని వెళ్ళడానికి ప్రయత్నించాడు. ఆమె విదిలించి యేడ్పు ఎక్కువ చేస్తూ బిగ్గరగా తన దురదృష్టాన్ని తలుస్తోంది 'నోర్ముయ్' అన్నట్టు దవడలు వాయగొట్టాడు. గుంజుకునే యత్నంలో గాజులు కొన్ని వగులగొట్టాడు. బంగారుగాజులు చేతికొచ్చిన మరుక్షణం అతను బజార్లో పడ్డాడు, విషయమేమిటో అని పక్క పోర్షన్లో వాళ్ళు బయటికొచ్చారు. తటాలున లేచి దబాలున తలుపేసి వచ్చి మంచంలో పడింది. పగిలిన గాజుముక్కలు గీరుకుపోయి చేతుల్నిండా రక్తం అయింది. వెక్కి వెక్కి యేడ్చే ఏడుపునిండా ఆలోచనలు తన విషయం తెలిసి పుట్టింట్లో అందరూ ఏడుస్తున్నట్టు చుట్టు ప్రక్కల వాళ్ళు నవ్వుకుంటున్నట్టు, సుశీల నొచ్చుకుంటున్నట్టు, శకుంతల హేళనగా నవ్వుతున్నట్లు అనిపించింది. ఫలినిచూసి వాతలు పెట్టుకున్నట్టు గాజుల్ని, ముక్కుల్ని నమ్ముకుంటావా? అని ప్రశ్నిస్తోంది మనసు. భర్తను మెల్లగా దారిలో పెట్టుకో అని చెప్తోంది సుశీల. ఏమైనా చెయ్యి కాని నీకో వ్యక్తిత్వం లేకుండా మాత్రం బ్రతక్కు అని ఉపన్యసిస్తోంది శకుంతల. శకుంతల మాటలెన్నో జ్ఞాపకానికొచ్చాయి. గాజుల మహిమ కాదు, ముక్కు కాదు, నువ్వుద్యోగం చేస్తున్నావనీ సంపాదించి పెడతావని ఆశపడే భర్తలో నీకో బేశ్వర్రి వాటడు అని శకుంతల అంటున్నట్టనిపించింది. .... ఆలోచనల్ని

పిండుతున్నట్టుగా సన్నని యేడ్పు, యేడ్పును మళ్ళిస్తున్నట్టుగా మగత .... మగత నాక్రమించుకున్నట్టుగా నిద్ర.

వసంత కళ్ళు తెరిచింది. నిజంగా కళ్ళు తెరిచింది. కళ్ళు తెరిచేసరికి చీకటిగా వుంది. వెలుగుకోసం కిటికీ తెరిచింది. బయట కూడా చీకటిగా వుంది. వెలుగును ప్రసవించే స్థితిలో కాలం కళ్ళు మూసుకున్నట్టుగా వుంది. గాలి మాత్రం చల్లగా తగిలింది. ప్రాణం తేలికపడింది. ఎంత రాత్రయిందో తెలియ లేదు. లేచి లైటు వేసింది - మూఢనమ్మకాలు పగిలినట్టుగా చేతిమీద రక్తం మరకలు కనిపించాయి.

1974